
# షేక్ చిన మస్తాన్‌వలి బ్యాండు ట్రూప్



ఖాజా

గాలి. సప్పుడు గాకుంట చెట్ల నూపుతంది. ముడిసందున ముడి బడుకుంట పొద్దు గూకుతంది. సూర్యుడు పొయి చిన్నంగ ఆకాశంలో అక్కడక్కడ సుక్కలు పొడుస్తున్నయ్. గుట్ట మీది నించి ఇంకా ఎండాకాలపు అగుడు కొడతనే వుంది. వేడివేడి గాలి వుండుండి తెప్పలు తెప్పలు గొస్తంది. గాలొచ్చినప్పుడల్లా ఇండ్ల మీది తాటాకులు ఉందువా- పోదువా అన్నట్టు లేసిలేసి పడతన్నయ్.

బయట ఈదురుగాలి ఎక్కువయ్యేసంది వాకిట్లో వున్న పొయిలోనించి నిప్పురవ్వలు సనసన్నంగ మిణుగురు పురుగుల్లెక్క గాల్లోకి ఎగిరి పోతన్నయ్. 'థూ ఈ గాలి మీద మన్నుబడ ఒక్క పని సక్కగ చేసుకోనీయదు' అనుకుంట గబగబ ఒక చాట దెచ్చి పొయ్యికి సాటు బెట్టింది ఉద్దండమ్మ.

పీట పొయి దగ్గరికి లాక్కోని మోకాళ్ల మీద చేతులు బెట్టి అమ్మమ్మమ్మమ్మ అనుకుంట వొంగి పీట మీద కూసుంది. పొయి మీద అన్నం వుడుకుతంది. పక్కన పొంతలో నీలు కాగుతన్నయ్. అన్నం మీద మూతదీసి గంటెతోని నాలుగు మెతుకులు తీసి పట్టుకోని నలిపి సూసింది. పలుకుంది. మిగిలిన మెతుకుల్ని మల్లీ గిన్నెలో ఏసి కలబెట్టి గంటి తీసి గిన్నె మీద మూత బెట్టింది. పొయ్యికి మూడో రాయి లెక్కున్న పొంత మీద నించి మూకుడు దీసి చెయి బెట్టింది. గోరెచ్చ లైనయ్- 'వీల్లొచ్చేపాలికి మంచిగనె గరమయితయిలె' అనుకుంది.

'నిన్న పొద్దుననంగ పోయిన్రు. రాత్రెప్పుడో పెండ్లై పోతే పొద్దటికి రావల్సిన మడుసులు. పొద్దుగూకతన్న రాకపాయిరి. ఈ మడిసి ఉన్నకాడుండడు. సదువుకునే పిలగాడ్ని ఎమ్మటేస్కోని పోయిండు'- అని లోపల్లోపల నుకుంట పొయి పక్కనున్న మూరెడు పొడుగు కందిపుల్లొకటి తీసి చిలవలిరగ దీసి, యెనక జాకిట్లోకి పెట్టి యీపు గోక్కుంటా పొయ్యి కాడ్నుంచి లేసింది.

తెల్లారుజామున గింత సద్దన్నం తిని- అడివికి కట్టెలు ఏరటానికి పోయింది. ఎండాకాలం వొస్తె ఇదొక పెద్దపని. సంవత్సరం మొత్తం సరిపొయ్యే కట్టెపుల్లల న్నీ ఎండాకాలమే పోగేసి పెట్టుకోవాల. లేకుంటే వానలల్ల పొయి మండక, వంటజేసుడు పరేషానైద్ది. అందుకనే ఉద్దండమ్మ అడివికి పోయి సాయంత్రందనక పుల్లలు పోగేసొచ్చింది. ఇగ ఏదన్న ఒకరోజు సోపతి జేసుకోని ఎవలదన్న ఎడ్లబండి దీస్కోని పొయి పుల్లలు ఏసుకోని రావచ్చు.

ఉద్దండమ్మకి పొద్దుట్నుంచి ఒల్లంతా చెమటబోసి చిరాగ్గుంది. అడివికి నడిసిపొయ్యి రాటాన కాల్లు నొప్పి లేత్తన్నయ్. ఎండనబడి తిరిగి తిరిగి రాటాన ఒక రకంగా, తిక్కతిక్కగా వుంది. తొందరగ తానం జేసి కాత్తంత తిని పండుకుంటే ఈల్లెప్పటికైనా రానీ అనుకుంది. అనుకుండి గాని వాల్లింకా ఎందుకు రాలేదా అని ఒక పక్కన గుంజుతనే వుంది.

దడిబైట పిల్లగాల్లు గోలగోలగ ఆడుకుంటన్నారు. ఉద్దండమ్మ చిన్న బిడ్డలిద్దరూ మొత్తల పక్కనున్న పొన్నాయి చెట్టుకింది పూలేరుకొచ్చుకోని లోన కూసోని జడలల్లుతన్నరు. పొద్దుట్నుంచి ఇంట్లో ఎవర్లేకపోటాన ఏడాడ తిరిగి ఎండలో ఆడొచ్చిన్రో. ఎండకి తలలెంటి పొయి, మొకాలు మసిబారి వాడిన పొన్నాయి పూల లెక్క అయిపోయిన్రు. అదే కొడుకుంటే పిల్లల్ని బయట తిరగనియ్యకుంట వుండేటోడు. ఇంటికాడుంటే ఎప్పుడు సదువుకుంటనో, రాసుకుంటనో, ఏదన్న పని జేసుకుంటనో వుంటడు. నా బిడ్డ బంగారం. ఈ మనిసి, వాన్ని సెలవలల్లో కూడ సుకంగ ఇంట్లో వుండనియ్యడు. మల్లిపైన యెమ్మటి బెట్టుకోని మేలానికి తీసకపోతన్నడు. ఈన జేసి సంపాయిచ్చిందేం లేదు గానీ మల్లి పిలగాన్ని కూడా యిందులో తిప్పుతున్నడు "ఎంగిలి పీకలల్లో ఏ మొత్తదే ఎన్నాల్లు వాయించినా, చేతికి మూతికి ఎడం పెరుగుడే తప్ప" అని మా నాయిన పెండ్లినాడే చెప్పిండు. ఈనేమొ ఏం పన్జేయ లేడాయె. విద్వాంసుడు కావాలని, కచేరీలు జెయ్యాల్నని, మెడర్సులు యేయించుకోవాల్నని ఎన్ని కలలు గన్నడు. ఆకరికి పెండ్లిల్లకి మేలానికి పోతన్నడు. అనుకున్నయన్నీ అయితాయ్? మతిలోనే అనుకుంట జుట్టిడిసి కొబ్బరినూనె సీసా తెచ్చుకొని మొత్తలో కూసుంది. చేతిలో నూనెబోసి తలకి రాసుకుంట "ఆడిన కాడికి సాలుగానీ, రాండి. తలకి నూనె బెడ్త" అని బిడ్డలిద్దర్ని దగ్గరికి పిలిచింది.

బయట ఈదురుగాలి యింకాస్త పెరిగింది. బయటాడే పిల్లల్ని చూసి, ఎప్పుడు బయటకురుకుదామా అన్నట్టున్న బిడ్డలిద్దరికీ తలకి నూనె పెట్టింది. లేసి పొయిలో నుంచి పుల్లలు బయటికి లాగి నీల్లు జల్లింది. పొయి మీద నించి అన్నం దింపి తీసక పొయ్యి లోన బెడదామనుకుంటుండగా సుబాను హడావుడిగా దడితోసుకొని వాకిట్లోకొచ్చిండు. గాబర గాబరగున్న సుబాన్ను జూసి "ఏరా సుబాను, ఈల్లేరి?" అనడిగింది ఉద్దండమ్మ. సుబాను చిన మస్తాన్‌వలి బ్యాండు ట్రూపులో సైడ్రమ్ వాయిస్తడు. మస్తాన్‌వలితో కల్సి నిన్న పెండ్లి మేలానికి పొయిండు. "అదిగాదు పుప్పు, మామూకి మంచిగ లేదు, దవకానలో బెట్టినం...", "ఏందిరా సుబాను, ఏమైందిరా మీ మామకి?" ఉద్దండమ్మ గాబరాగ అడిగింది. "ఏం కాలేదులే పుప్పూ, పొద్దున మామూకి నోట్లోంచి కొద్దిగ నెత్తురొచ్చింది. మంచిగలేదని కండ్లు తిరుగుతన్నయని అన్నడు, ఎమ్మటే కొత్తగూడెంలనే నాగరాజు దవాకానకి దీస్కపాయినం". "ఇప్పుడెట్టున్నదిరా?" ఉద్దండమ్మ వచ్చే ఏడుపుని గొంతుల తొక్కిపెట్టి అడిగింది. "డాక్టరు జూసిండు. రెండ్రోజులు అక్కన్నే వుండాల్నన్నడు. పొద్దుట్నించి సూదులు, మందులు ఏత్తనే వున్నరు. చేతికి గుల్కోజు బెట్టిన్రు. మనోల్లంతా అక్కణ్నే వున్నరు. నిన్ను దీస్కోని రమ్మని నన్ను దోలిన్రు"- ఉద్దండమ్మకి గాబరా ఎక్కువైంది. గాలికి చెరువులో నీల్లు అలుక్కున్నట్టు ఉద్దండమ్మ కళ్లల్లో నీల్లు రెపరెపలాడినయ్.

మరిన్ని నీల్లుజల్లి పొయ్యి ఆరిపి, బయిటున్న గిన్నెలన్ని గబగబా లోనేసింది. వాకిట్లో ఉన్న మంచం ఎత్తి లోనేసింది. ఉతికిన చీర తీసి ఒంటికి సుట్టుకోని పైసల కోసం ఇల్లంతా ఎతికింది. ఎక్కడా ఒక్క రూపాయి కూడ దొరకలే. అసలికి యాడ్నన్న నాలుగు పైసలు దాసి పెడితెగద దొరకటానికి. 'సాయిబయ్య సంపాదన బూబమ్మ ఆకొక్కకి సరిపోదన్నట్టు' మస్తానయ్య పంపాదిచ్చింది లేదు- కూడబెట్టింది లేదు. ఎప్పుడన్నా పానాల మీదికొచ్చిందంటే ఉన్న ఇల్లు అమ్మాలనుకోటమేగాని ఎప్పుడూ ఏదీ కొనాల్ననుకున్న రోజేలేదు.

ఉద్దండమ్మకి తెలుసు.


ఎక్కడా పైసల్లేవని.

కానీ ఎతుకుతుంది. ఆలోచిస్తంది.

నన్నగా ఏడుస్తుంది.

బయట బీడీ తాక్కుంట నిలబడ్డ సుబాను- "పుప్పూ- జల్దీగానీ- మల్లీ పొద్దుపోతే ఈడ్నించి పూల్లెకి ఆటోలుండవ్- అవతల బస్సులు గూడ సరిగ దొరక వ్" అని లోపటికి సూసుకుంట పిల్చిండు.

గోడకి సీలగొట్టి తగిలిచ్చిన జాన పాడు సైదులు దర్గా ఫుటో వెనక చెయ్యి పెట్టింది. పెంటుసాయిబు మనవడికి పుట్టెంటికలు తీయడానికి పోయినపుడు కొడుకు దర్గాల కొని తెచ్చి తగిలిచ్చిండది. ఫుటో ఎనక నించి మూట గట్టివున్న ఒక పాత దస్తీ తీసింది. ముడిప్పింది. పైసలు, ఐదు రూపాయలు, పది రూపాయల నోట్లు. మొత్తం లెక్క బెట్టింది. నాలుగొందలున్నయ్. తీసి బొడ్లో సంచి దీసి అందు లో బెట్టుకుంది. బయటికొచ్చి పక్కింట్లో ఉన్న మైబమ్మకి కొంచెం పిల్లల్ని చూసుకోమని చెప్పి బయల్దేరింది.



*** ***

దవఖానలో చిన మస్తాన్‌వలి పరిస్థితి మంచిగ లేదు. ఎందేందో జేస్తున్నరు డాక్టర్లు. నోట్లో నించి రక్తం పడ తనే ఉంది. దగ్గినప్పు డల్ల రక్తం గడ్డలు పడత న్నయ్. డాక్టర్లనడిగితె బతికేటిది కష్టమేనని చెప్పిన్రు. మస్తాన్‌వలి ట్రూప్‌లో ఉన్నోల్లంతా అక్కణ్నే ఉన్నరు. ఏం జెయ్యాల్నో ఎవ్వరికి తెలుస్త లేదు.

కొడుకు గూడ అక్కణ్నే ఉన్నడు. అక్కడున్న పెద్దో ల్లు వాల్ల బాబకి ఏంగాదని వానికి ధైర్యం జెపుతు న్నరు.

ఉద్దండమ్మ దవఖానకి చేరేసరికే మస్తాన్‌వలి బతకడని అందరికి తెలిసిపోయింది. ఉద్దండమ్మ ఏడుస్తలేదు. ఏం జెయ్యాల్నోగూడ తోస్తలేదు.

కొడుకుని దగ్గరకి తీస్కోని మస్తానయ్య మంచం దగ్గిర కూసుంది.

మస్తాన్‌వలికి మాట వొస్తలేదు.

సూస్తుండు.

కొడుకుని, పెండ్లాన్ని మార్చిమార్చి సూస్తుండు.

కండ్లల్ల నీల్లు నింపుకోని సూస్తుండు.

మస్తానయ్య కండ్లల్ల నీల్లు సూడంగనే ఉద్దండమ్మకి ఏడుపు తన్నుకోనొచ్చింది.

కొంగు నోట్లె బెట్టుకొని ఏడుస్తుండంగ డాక్టరొచ్చిం డు. డాక్టర్‌ని సూడంగనె ఉద్దండమ్మ పానం లేసొచ్చిం ది. నాగరాజు డాక్టరంటే ఎసువంటి జబ్బునైనా నయం జేస్తడని గొప్ప పేరుంది. సచ్చే మడిసిని తీస్కొచ్చినా రెండు దినాలల్ల లేపి మంచిగ జేసి ఇంటికి పంపిస్త డని చానామంది చెప్పుకోంగ ఇన్నది.

ఎట్లనన్న జేసి మస్తాన య్యని బతికియ్యమని డాక్టర్‌కి రెండు చేతుల్తో ని దండం బెట్టింది.

ఆ రాత్రి దవ ఖానలో ఉద్దం డమ్మ ఎట్లుం దో- ఏం జేసిందో- మొత్తం మీద తెల్లారింది... చిన మస్తాన్‌వలీ మాత్రం కండ్లు తెర వలేదు.

సన్నాయి ఊదీ ఊదీ- సన్నాయిలాగే చిల్లులు పడిపోయిన చిన మస్తాన్ వలీ ఊపిరి తిత్తులు తెల్లా రుజామునే ఆగిపోయినయ్.

ఉద్దండమ్మ ఒంటరిదైపోయింది- ఉద్దండమ్మ కండ్లల్లో కొడుకూ- ఇద్దరు బిడ్డలు కనిపిస్త న్నారు.

ఒల్లంతా గుంజక పోతనట్టయింది- చీక టి పడ్డట్ట యింది.

ఎమ్మటున్న బ్యాండు ట్రూపులో వాల్లందరూ తలా ఒక చెయ్యేసిన్రు.

*** ***

చూస్తుండగనే ఎండలు పొయి వానలు మొదలయినయ్. ఉడుకుడుకన్నం ప్లేటులో బెట్టి అంచుకింత పచ్చడేసి కొడుకు ముంగల బెట్టింది. సాపమీద కూసొని సన్నాయి బాగు జేసుకుంటన్నడు కొడుకు. లోపటికి బొయి చిన్న బ్యాగు దులిపి సదరటం మొదలుబెట్టింది ఉద్దండమ్మ. లోపట్నించి కొడుకు కనిపిస్తండు. ఆ సాప మీద కూసొ నే పదో తరగతి పరీక్షలకి సదివిండు. పది పాసైండు.

వాడు పదిలో చేరిన కాడ్నుంచి అప్పుడు ఐదు ఇప్పు డు పది కూడబెట్టి దస్తీలో మూటగట్టింది. కొడుకు పది పాసైనంక- "కాలేజి సదువుతడు. అప్పుడు వాడు మంచి బట్టలు తొడుక్కోని కాలేజికి పోవాల. అందుకు పైసలు గావాల్నని". వాని సదువు కోసం ఉద్దండమ్మ ఆలోచించని రోజు లేదు.

ఆ ఊరి సుట్టుపక్కలున్న మొత్తం దూదేకులోల్లల్లో పది పాసై కాలేజి సదివిన పురుగు లేదు. అందరు ఐదు, ఆరు, ఏడు సదివి ఆపినోల్లే- మా జదివితే పది జదివి బందుజేసి నోల్లున్నరు. ఆపేసి మిషిను కుట్టట వో, దూది ఏకి పరుపులు కుట్టటవో, గడియారాలు బాగు చెయ్యటవో, సైకిల్లు, స్కూటర్లు బాగు జెయ్యట వో నేర్సుకోటం-

ఇరవై ఏల్లకల్ల పెండ్లిజేసుకోటం- లేకుంటె చిన్న కొట్టు బెట్టుకొని బేరం జెయ్యటం. అంతేగాని కొంచెం ఎక్కువ సదువుకున్న నాడుడే లేడు-

ఉజ్జోగం జేసే మడిసి ఒక్కడు గూడ లేడు.

ఉద్దండమ్మకి కొడుకు బాగ జదువుకోవాల్నని ఆశ

వాడు అందరితోని 'సార'ని పిలిపిచ్చుకోవాల

అందరు వాడికి నమస్తే బెట్టాల

వాడు మంచి ఉజ్జోగం జెయ్యాల

దూదేకులోల్లందర్లో ఉద్దండమ్మ కొడుకు బాగా సది విండని అందరు చెప్పుకోవాల

ఉద్దండమ్మకి ఆశ. బాగా ఆశ. అందుకె యాడాది నించి కష్టపడి పైసలు కూడబెట్టింది.

నాలుగొందల రూపాయలు- మస్తానయ్య సావుతోని ఆశలన్ని తీరిపోయినయ్. కూడబెట్టిన పైసలు గూడ అయిపోయినయ్.

అప్పు గూడ శానా అయింది.

> ఇంగిప్పుడు కొడుకు బ్యాండు మేలానికి పోవాల్సిందె. కాలేజికి పొయ్యేది లేదు. ఊదీ ఊదీ ఊపిరంతా సన్నాయిలో పొయ్యాల్సిందే.

చెప్పాల్నంటె ఇల్లు గడుసు డు గూడ శానా కష్టమైంది.

ఇంగిప్పుడు కొడుకు బ్యాం డు మేలానికి పోవాల్సిందె.

కాలేజికి పొయ్యేది లేదు.

ఊదీ ఊదీ ఊపిరంతా సన్నాయిలో పొయ్యాల్సిందే.

తల్సు కుంటే ఉద్దండమ్మకి దుక్కం ఆగుతలేదు.

బయట బ్యాండోల్లు వచ్చేసిన్రు.

కొడుక్కి బ్యాగందిచ్చింది ఉద్దండమ్మ.

బ్యాగు తగిలిచ్చుకొని సన్నాయి తీసుకొని వాళ్లల్ల కలిసిండు కొడుకు. అంతకి ముందే మంచిగ తుడిసిన ట్టున్నడు- గోడకి తగిలిచ్చిన బోర్డుని. చెక్కబోర్డు మీద పెయింటుతోని రాసిన అక్షరాలు మెరుస్తున్నయ్- 'షేక్ చిన మస్తాన్‌వలి బ్యాండు ట్రూప్'.

(స్త్రైబాబకి ప్రేమతో)

